క్లుప్తంగా

తీర గ్రామాల ప్రజలకు ఎస్సై సూచనలు

మామిడికుదురు: గోదావరి వరద ప్రభావిత తీర గ్రామాల ప్రజలకు నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ సోమవారం పలు కీలక సూచనలు చేశారు. గోదావరి నదిలో నీటి ప్రవాహం తీవ్రంగా పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో భద్రతా కారణాల వల్ల నదిలో దిగి స్నానం చేయరాదన్నారు. సందర్శన కోసం నదిలోకి ప్రవేశించడాన్ని పూర్తిగా నిషేధించామన్నారు. గోదావరి లంక ప్రాంతాల్లో ఉన్న పశువులు, ఇతర జీవులను వెంటనే ఏటిగట్టు ప్రాంతాలకు తరలించుకుని వాటిని సంరక్షించుకోవాలన్నారు. నదిలో చేపల వేటకు వెళ్లడం, వరద నీటిలో కొట్టుకు వచ్చే కలప కోసం వెళ్లడం పూర్తిగా మానుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 9440904853 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

డ్రైన్ సమస్యను పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు వినతిపత్రం ఇచ్చిన రాంబాబు, మాలే

మలికిపురం: రాజోలు నియోజకవర్గ దుఃఖదాయని శంకరగుప్తం మేజరు డ్రైన్ ముంపు సమస్యలపై నియోజకవర్గ బీజేపీ నాయకులు ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు వినతి పత్రం అందించారు. రాజమహేంద్రవరంలో ఈ మేరకు కలసి సోమవారం వినతిపత్రం అందించారు. దీనిపై వీర్రాజు డ్రైనేజీ అధికారులతో మాట్లాడారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఇప్పటికే తీసుకున్న పలు చర్యల వల్ల రూ.6 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని డ్రైనేజీ అధికారులు చెప్పినట్లు ఎమ్మెల్సీ వివరించారు. రాజోలు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ అడబాల రాంబాబు, అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ తదితరులు సోమును కలసిన వారిలో ఉన్నారు.

సంకష్టహర చతుర్థి పూజలు



లక్ష్మీగణపతిహోమంలో పాల్గొన్న భక్తులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం సంకష్టహర చతుర్థి పూజలు వైభవంగా జరిపారు. స్వామి వారికి వేకువజాము నుంచి ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి మేళాతాళాల మధ్య మాఢవీధుల్లో ఊరేగించారు. స్వామివారి ఆలయంలో నిర్వహించే లక్ష్మీగణపతి హోమంలో 44 మంది భక్తదంపతులు పూజలు జరిపారు. అలాగే స్వామికి ఇరువురు జంటలు పంచామృతాభిషేకం, లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 47 మంది భక్తదంపతులు పాల్గొన్నారు. ఈ స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎ.రాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సోమవారం స్థానిక సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షత వహించగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. గత మూడు నెలల కాలంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్‌లో చేపట్టబోయే పనులపై సమీక్ష నిర్వహించడంతో పాటు అధికారుల నుంచి ప్రగతి వివరాలను సమావేశం తెలుసుకుంటుందని ఎంపీడీఓ పేర్కొన్నారు.

బ్యాడ్మింటన్‌లో అక్కాచెల్లెళ్ల ప్రతిభ



ప్రతిభ చూపిన మేఘన, సింధు

మలికిపురం: రాజమహేంద్రవరంలో ఈ నెల 12, 13 తేదీల్లో బొప్పన గోల్డెన్ పాయింట్ స్టేడియంలో జరిగిన ఉమ్మడిగోదావరి జిల్లాల స్థాయి ఎంపికల్లో మలికిపురం శ్రీరామ్ బాడ్మింటన్ అకాడమీకి చెందిన అక్కాచెల్లెళ్లు గుబ్బల మేఘన, గుబ్బల సింధులు రాణించారు. అండర్-11 డబుల్స్ విభాగంలో మేఘన,సింధు ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే అండర్-11 సింగిల్స్‌లో గుబ్బల సింధు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు అకాడమీ చైర్మన్ దెందుకూరి రాంబాబురాజు, కోచ్ హరికృష్ణ తెలిపారు. విద్యార్థుల ప్రతిభను సఖినేటిపల్లి ఎంపీపీ వీరా మల్లిబాబు అభినందించారు. కాగా ఆరో తరగతి చదువుతున్న ఈ అక్కాచెల్లెళ్లు సఖినేటిపల్లి మండల ఉపాధ్యక్షుడు గుబ్బల అంజి కుమార్తెలు.

మట్టి పరీక్ష.. నేలకు రక్ష



భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారులు, సిబ్బంది



భూసార పరీక్షలకు వరి చేలో మట్టి నమూనాలు సేకరిస్తున్న, మండల వ్యవసాయ సిబ్బంది

- భూసార పరీక్షలతో ప్రయోజనాలు
- ఫలితాలననుసరించి సాగుచేస్తే అధిక దిగుబడి
- ఖర్చు తక్కువ, రాబడి ఎక్కువ

రావులపాలెం: ఆరోగ్యకరమైన పంటలు పండాలంటే నేలలో ఖనిజ లవణాలు, పోషకాలు ఉండాలి. అయితే ప్రస్తుతం అధిక దిగుబడి సాధించాలనే ఉద్దేశంతో రసాయన ఎరువులు అధికంగా వినియోగిస్తున్నారు. దీంతో భూమి సమతుల్యత కోల్పోతోంది. మొక్కకు సరైన పోషకాలు అందక పంట దిగుబడిపై ప్రభావం పడుతోంది. ఈ సమస్య పరిష్కారానికి మట్టి పరీక్షలు చేయించాలి. ఫలితాలకు అనుగుణంగా పంటను సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చు. దీని వల్ల ఖర్చు తక్కువ కావడంతో పాటు దిగుబడి పెరిగి, రైతులకు రాబడి అధికంగా ఉంటుంది.

భూసార పరీక్షలు కీలకం

భూమిలో ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం పరిమాణాల్లో మార్పులను భూసార పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. సూక్ష్మ పోషకాల లోపాలను తెలుసుకోవడమే కాకుండా భూమిలో ఏ పోషకాలు తగ్గాయనే విషయాన్ని తెలుసుకోవచ్చు. సేంద్రియ కర్బనం తగ్గితే పచ్చిరొట్ట పంటలను సాగుచేసి నష్టాలు నివారించవచ్చు. నేల పోషక సామర్థ్యాన్ని తెలుసుకోవడం ద్వారా ఏ పంట వేస్తే మంచి దిగుబడి వస్తుందో రైతులు గ్రహించే అవకాశం ఉంటుంది.

మోతాదు మించితే..

పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలనే తపనతో మోతాదుకు మించి వాడుతున్న రసాయన ఎరువుల వల్ల భూమిలో పోషకాలు నశించిపోతున్నాయి. పోటాషియం ఎక్కువగా వాడడం వల్ల మెగ్నీషియం, జింక్, ఇనుము వంటి పోషకాలు మొక్కలకు అందకుండా పోతాయి. జింకు లోపం కారణంగా మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతుంది. సూక్ష్మ పోషకాలతో పాటు నైట్రోజన్, సేంద్రియ కర్బనాల స్థాయి చాలా కీలకం. సేంద్రియ కర్బనం లోపిస్తే భూమి తన సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఎంత ఎరువు వేసినా భూమి గ్రహించకుండా నిస్సారమైపోతుంది.

ప్రయోగశాలల్లో..

భూమిలో సేంద్రియ కర్బనం 0.5 శాతం నుంచి 0.76 వరకు ఉంటే సాధారణంగా పరిగణిస్తారు. చాలా చోట్ల భూమిలో ఇది 0.1 నుంచి 0.20 శాతం వరకు ఉన్నట్లు గత పరీక్షల ద్వారా తెలిసింది. మట్టిని ప్రయోగశాల్లో విశ్లేషించి ఆ నేల స్వభావం, లక్షణాలు, పోషక విలువ స్థాయిలను గుర్తిస్తారు. ఈ ఫలితాల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. ప్రతి మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించడం మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

ప్రయోజనాలు ఇవే..

మట్టి పరీక్షల్లో ఆమ్ల, క్షార లవణాల స్థాయి, సేంద్రియ కర్బనం, భాస్వరం, పొటాషియం ఎంత నిష్పత్తిలో ఉన్నాయో తెలుసుకుని, పంట వయసు కాలాన్ని అనుసరించి ఎరువులను సమపాళ్లలో అందించవచ్చు. ఆమ్లగుణం ఉన్న నేలను సున్నం, క్షార గుణం ఉన్న నేలలను జిప్సంతో బాగు చేసుకోవచ్చు. నేలలో సహజంగా ఉన్న పోషకాల స్థాయిని తెలుసుకుని సాగు చేసే పంటలకు ఎరువుల మోతాదును నిర్ణయించుకోవచ్చు. నేల పోషక సామర్థ్యాన్ని తెలుసుకుని ఏ నేలలో ఏ పంట వేస్తే మంచి దిగుబడులు వస్తాయో తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది. పంటకు నేలలో తగు నిష్పత్తిలో పోషకాలు లేనప్పుడు భూసార పరీక్ష ద్వారా తగ్గిన పోషకాలను అందించి దిగుబడులు పెంచుకునే అవకాశం ఉంది. పెట్టుబడి తగ్గి దిగుబడి పెరగాలంటే రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి.

ఇదే సరైన సమయం

రైతులందరూ తమ పొలాల్లో మట్టి నమూనాల సేకరణ చేయించుకోవాలి. వాటికి మట్టి పరీక్షలు చేయించుకోవడం వల్ల భూమిలోని పోషక లోపాలను తెలుసుకోవచ్చు. వాటిని నివారించడం ద్వారా సాగులో మంచి ఫలితాలు పొందే అవకాశం ఉంటుంది. చాలామంది రైతులు సాగు సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడంతో దిగుబడులు కోల్పోతున్నారు. ఏటా ఒకే రకమైన పంటలు వేయడం, ఎవరికి తోచినట్టు వారు సాగు చేయడం, ఇష్టానుసారంగా మందులు, ఎరువులు వినియోగించడం తదితర కారణాలతో వ్యవసాయంలో అనుకున్నంత ఆదాయాన్ని పొందలేక పోతున్నారు. మట్టి పరీక్షలకు ఇదే సరైన సమయం. కొత్తపేట వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 25,034 ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. ఆలమూరు మండలంలో 9000 ఎకరాలు, ఆత్రేయపురం మండలంలో 4,494 ఎకరాలు, రావులపాలెం మండలంలో 4,728ఎకరాలు, కొత్తపేట మండలంలో 6,812 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

రైతులకు ఎంతో మేలు



సుమారు నెల రోజులుగా పొలాల్లో మట్టి నమూనాలను సేకరించాం భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే రైతులకు అధిక దిగుబడులు వస్తాయి. ఈ ఏడాది కూడా భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నాం. రావులపాలెం మండలానికి 1,242 మట్టి నమూనాలు లక్ష్యంగా ఇవ్వగా అన్ని నమూనాలు సేకరించి, వాటిని ప్రయోగశాలకు పంపించాం. వాటి ఫలితాలు వచ్చిన వెంటనే రైతులకు అందిస్తాం.

– బి.మీనా, మండల వ్యవసాయ అధికారి, రావులపాలెం

ఎమ్మెస్సార్‌కు జగ్గిరెడ్డి పరామర్శ



ఊబలంకలో సత్యవతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా పార్టీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి

రావులపాలెం: మాతృవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు మేడపాటి శ్రీనివాసరెడ్డి (ఎమ్మెస్సార్)ను మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. మండలంలోని ఊబలంక గ్రామానికి చెందిన ఎంఎస్సార్ తల్లి మేడపాటి సత్యవతి ఇటీవల మృతి చెందారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి సోమవారం ఊబలంకలో ఎమ్మెస్సార్ స్వగృహానికి వెళ్లి ఆయనను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. దివంగత సత్యవతి చిత్రపటం వద్ద పుష్పాలుంచి, ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

18న ఎక్సైజ్ వాహనాలకు వేలం

ఆలమూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం జరగనుంది. ఆలమూరు ఎక్సైజ్ ఎస్సై పి.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆదేశాల మేరకు స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించే ఈ వేలంలో పాల్గొనే వ్యక్తులు తప్పనిసరిగా ప్రభుత్వ గుర్తింపు కార్డు నకలుతో పాటు ధరావత్తు రూ.రెండు వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ వేలంలో అధిక ధరకు దక్కించుకున్న అధిక పాటదారుడు వాహనాన్ని దక్కించుకున్న ధర మొత్తాన్ని, జీఎస్టీ రుసుం 18 శాతంతో కలిపి చెల్లించాలన్నారు. వేలం రద్దు పరచడానికి, వాయిదా వేయడానికి ఎక్సైజ్ అధికారులకు పూర్తి హక్కులుంటాయని ఆయన పేర్కొన్నారు.

పలువురికి గొల్లపల్లి పరామర్శ



దుర్గాప్రసాద్‌ను పలకరిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి

మామిడికుదురు: మండలంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాజోలు నియోజకవర్గం ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి సోమవారం పలువురిని పరామర్శించారు. ఇటీవల అనారోగ్యం బారిన పడి కోలుకుంటున్న పి.గన్నవరం నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్‌ను పరామర్శించారు. మామిడికుదురు మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము కుమారుడు అనారోగ్యం బారిన పడి ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రామును కూడా వారు పలకరించారు. పితృవియోగంతో బాధపడుతున్న కొమరాడ మాజీ సర్పంచ్ పోశంశెట్టి విస్సును కూడా పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు భూపతిరాజు సత్తిబాబురాజు, కటకంశెట్టి ఆదిత్య, తెన్నేటి కిశోర్, పాముల రంగారావు, తోరం సూర్యభాస్కర్, తులా గోపాలకృష్ణ, ఉచ్చుల విష్ణు, కొల్లాబత్తుల వెంకటరమణ, దాకే చిరంజీవి తదితరులు ఉన్నారు.

నిత్యాన్నదానానికి పలువురి విరాళాలు



అయినవిల్లిలో దాత దంపతులకు స్వామి చిత్రపటం అంజేస్తున్న అర్చకులు



అప్పనపల్లిలో దాత కుటుంబ సభ్యులకు స్వామి చిత్రపటం అందిస్తున్న సోమయాజులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి పాలకొల్లుకు చెందిన పొన్నయుగ శ్రీసత్యదేవ్, స్వాతి దంపతులు సోమవారం రూ.10,116 విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకుడు సత్తిబాబుకు అందజేశారు. దాతను వేదపండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ అర్చక, కార్యాలయం సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ.11 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలుచేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన వాయువేగుల శ్రీరామారావు, శ్యామల సుభద్ర దంపతులు సోమవారం రూ.11,111 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ వేద పండితులు జె.సోమయాజులుకు అందజేశారు. దాత దంపతులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. స్వామి వారి శేషవస్త్రం, స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ వి.సత్యనారాయణ దాత దంపతులను సత్కరించారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు సన్మానం



కొత్తపాలెం పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సర్పంచ్ లక్ష్మీపతిరావు

కొత్తపేట: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కొత్తపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉత్తమ ఫలితాలతో ఒక ప్రత్యేక గుర్తింపు పొందిందని, భవిష్యత్‌లో మరింత గుర్తింపు తీసుకురావాలని బిళ్లకుర్రు సర్పంచ్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు ఉపాధ్యాయులను కోరారు. మండలంలోని బిళ్లకుర్రు శివారు కొత్తపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసి మండలం, జిల్లా పరిధిలో వివిధ పాఠశాలలకు బదిలీ అయిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు వీడ్కోలు సన్మానం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసిన శర్మ, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, మారుతీ శ్రీనివాస్, సాంబశివరావు, శ్రీనివాసరావు, ఎస్‌ఎస్ కుమార్, వై.నాగమణి, వెంకటలక్ష్మి, శర్వాణిలు ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో పాఠశాల హెచ్‌ఎం అక్కిరెడ్డి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో సర్పంచ్ లక్ష్మీపతిరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులను లక్ష్మీపతిరావు చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ డి.యేసయ్య, పలువురు గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీడని ముంపు



ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వే వద్ద ఇటుక బట్టీని చుట్టుముట్టిన వరద

అయినవిల్లి: వరదనీరు క్రమేపీ తగ్గుముఖం పడుతోంది. మండలంలోని ముక్తేశ్వరం-కోటిపల్లిరేవులో, ముక్తేశ్వరం వృద్ధ గౌతమి (తొగరపాయ) పాయలో, ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం వద్ద కాజ్‌వే వద్ద ఇటుకబట్టీల్లోకి చేరిన వరద తగ్గుతోంది. ఎగువ ప్రాంతాల్లో వరద ఉధృతి తగ్గడంతో లంక గ్రామాల్లోని ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. అయితే లంక గ్రామాల్లో నదీ పరీవాహక పల్లపు ప్రాంతాల్లోని వరద ముంపు చేరడంతో లంకల్లోని పంట పొలాలకు వెళ్లడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు వరద ప్రవాహంలో కొట్టుకొచ్చిన పాములతో భయం పట్టుకుంది. ఎక్కడ పాములు తమపై దాడి చేస్తాయోనని భయపడుతున్నారు.

ప్లాస్టిక్ వద్దు.. జూట్ ముద్దు

అంబాజీపేట: ప్రకృతికి హానీ కలిగించే ప్లాస్టిక్ కవర్లు, ఇతర సామగ్రికి స్వస్తి చెప్పి జూట్ బ్యాగ్‌లను వినియోగం ముద్దని డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్ అన్నారు. ఇరుసుమండలో తడి, పొడి చెత్తపై పంచాయతీ కార్యదర్శి ఆర్.ఏడుకొండలు చంటి అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడానికి ఉంచేందుకు అందరం కలసి పనిచేద్దామన్నారు. ఇంటింటికీ ఇచ్చిన ప్లాస్టిక్ టబ్‌లలో తడి, పొడి చెత్తలను వేరువేరుగా వేయాలన్నారు.

ప్రపంచ మేధావి అంబేడ్కర్

కొత్తపేటలో విగ్రహావిష్కరణ

కొత్తపేట: ప్రపంచమంతా ముక్తకంఠంతో కీర్తిస్తున్న మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక రెడ్డప్పవారిపేటలో నూతనంగా నెలకొల్పిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రెడ్డప్పవారిపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పేందుకు శ్రీకారం చుట్టి తొలుత మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని కలవగా ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే రూ.లక్ష విరాళం ఇవ్వడంతో పాటు ఆ ప్రాంగణం అభివృద్ధికి అవసరమైన మట్టి, మెటల్ సప్లై చేశారు. అదే గ్రామానికి చెందిన సహకార శాఖ అధికారి పచ్చమళ్ల బాబూప్రసాద్ ముందుకు వచ్చి విగ్రహాన్ని బహూకరించారు. ఆ విధంగా ఆ గ్రామస్తుల చిరకాల వాంఛ అయిన అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహం నెలకొల్పబడింది. ఆ విగ్రహాన్ని ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ఆవిష్కరించగా, విగ్రహం ప్రాంగణాన్ని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. వారు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లి, వాటిని సాకారం చేసుకోవడమే అంబేడ్కర్‌కు మనమిచ్చే గౌరవమని అన్నారు.

ప్రపంచ దేశాలకు అంబేడ్కర్ రాజ్యాంగం ఆదర్శం: జగ్గిరెడ్డి

డాక్టర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అన్నారు. రెడ్డప్పవారిపేటలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన జగ్గిరెడ్డికి ఆ గ్రామ యువకులు, పెద్దలు బాణసంచా కాల్పులు, పూలవర్షం నడుమ ఘనస్వాగతం పలికి అంబేడ్కర్ విగ్రహం వద్దకు తోడ్కొని వెళ్లారు. విగ్రహం శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ఆ మహనీయుని విగ్రహానికి జగ్గిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అసమానతలతో అనేక వర్గాలు అవమానాలు ఎదుర్కొంటున్న పరిస్థితులను రూపుమాపి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేడ్కర్ అని అన్నారు. జిల్లాకు ఆ మహనీయుని పేరు పెట్టిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు గుండెల్లో పెట్టుకోవాలని కోరారు. ఆయన పేరుతో గల జిల్లాలో వైఎస్సార్ సీపీకి అధ్యక్షుడిని కావడం తన అదృష్టమన్నారు. అనంతరం జగ్గిరెడ్డిని ఘనంగా సత్కరించారు. ముందుగా విగ్రహ దాత బాబూప్రసాద్, శిల్పి డాక్టర్ డి.రాజ్‌కుమార్‌వుడయార్, ప్రజాప్రతినిధులు, నాయకులను సత్కరించారు. కార్యక్రమాల్లో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్ బూసి జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల బ్రహ్మానందం, గొల్లపల్లి స్వరూప్‌రాజ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ, దళిత ఐక్యవేదిక కన్వీనర్ మోర్త వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

వరద ప్రభావిత ప్రాంతంలో తూముల ఏర్పాటు

ఆలమూరు: మండలంలోని మూలస్థాన అగ్రహారంలో వరదల సమయంలో ఏటా గండిపడే గోదావరి పరివాహక ప్రాంతంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా తూముల ఏర్పాటు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల ప్రజా పరిషత్ నుంచి రూ ఐదు లక్షలు, స్థానిక బట్టీ యూనియన్ నుంచి రూ.మూడు లక్షలతో కలిపి మొత్తం రూ.ఎనిమిది లక్షలతో నాలుగు అడుగుల వెడల్పు గల 21 తూములను కొనుగోలు చేశారు. వరద ఉధృతి ఎక్కువ అవుతున్నందున వేగంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

బాలాజీ స్వామికి రూ.2.75 లక్షలు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. స్వామి వారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. తెల్లవారు జామున సుప్రభాత సేవను అర్చకులు వేద మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. తొలిహారతిలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ, భూ సమేతుడైన బాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి తలనీలాలు సమర్పించారు. ముడుపులు, మొక్కులు చెల్లించారు. స్వామికి వివిధ సేవల ద్వారా రూ.2,75,614 ఆదాయం వచ్చింది. స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.82,046 విరాళంగా అందించారు. 4,500 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. 2,600 మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ ఈఓ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

సామూహిక అక్షరాభ్యాసం

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన అనూస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వలస కూలీల పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరావు పుట్టినరోజు సందర్భంగా దాత మచ్చా కుమార్‌రాజా సౌజన్యంతో ప్రముఖ మనస్తత్వవేత్త, ఇంద్రజాలికుడు చింతా శ్యామ్‌కుమార్ (శ్యామ్ జాదూగర్) సభ్యులు వివిధ రాష్ట్రాల నుంచి పొలం పనులు చేసుకోవడానికి వచ్చిన వలస కూలీల చిన్నారులకు అనూస్ స్వచ్ఛంద సంస్థ సేవా సంస్థ ద్వారా పుస్తకాలు, పలకలు, స్టేషనరీని అందించడంతో పాటు చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. శ్యామ్‌జాదూగర్ మాట్లాడుతూ పేదరికం చదువుకి ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అన్నపూర్ణ డే కేర్ హోం నందు వృద్ధులకు అన్నదానం నిర్వహించి పలువురు పేద చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనూస్ సభ్యులు డాక్టర్ మోహిత్, అన్నపూర్ణ, తేజశ్రీ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి చర్యలు



పార్టీ నాయకులతో సమావేశమైన మాజీ మంత్రి గొల్లపల్లి

రాజోలు: క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం చర్యలు చేపట్టిందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సోమవారం సోంపల్లిలో మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గొల్లపల్లి పాల్గొని మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు జరిగేందుకు అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో కూటమి ప్రభుత్వంపై పోరాటాలు చేస్తుందన్నారు. ఎన్నికల్లో బూటకపు హామీలు ఇచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు పార్టీని బలోపేతం చేసేలా మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నాయకులు కటకంశెట్టి ఆదిత్య, తెన్నేటి కిషోర్, అడబాల జానకీరామ్, చెల్లింగి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

శిథిల విద్యుత్ స్తంభాలు మార్పు చేయాలి

సఖినేటిపల్లి: మండలంలోని శృంగవరప్పాడులోని గెద్దం వారి గ్రూపులో శిథిల స్థితికి చేరిన విద్యుత్ స్తంభాలు మార్పుచేయాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు గ్రామస్తులు అర్జీ అందజేశారు. రెండు విద్యుత్ స్తంభాలు ఒరిగి ఉండడంతో సమీప కొబ్బరి చెట్లను తగులుకుని తరుచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. కొన్ని సందర్భాల్లో ఆకుల రాపిడి వల్ల మంటలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికుల ఆందోళనను దృష్టిలో ఉంచుకుని తక్షణం వీటి విషయంలో అధికారుల చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గెద్దం బాలరాజు, కె.రవి కిషోర్, జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పీజీవీఆర్ఎస్‌కు రెండు అర్జీలు

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం రెండు అర్జీలు వచ్చాయని ఎంపీడీఓ జి.సరోవరరావు తెలిపారు. ఒకటి తొత్తరమూడి నుంచి మ్యుటేషన్ కోసం, అయినవిల్లి నుంచి అగ్రిగోల్డ్ సంస్థ నుంచి తమకు సొమ్ములు రావాలని మరొకటి వచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు.

రేవుల వద్ద అన్ని జాగ్రత్తలు పాటించాలి

పి.గన్నవరం: గోదావరి వరదల సందర్భంగా పడవలు ఏర్పాటు చేసిన రేవుల వద్ద అన్ని జాగ్రత్తలు చర్యలు పాటించాలని, వరద తీవ్రత ప్రమాద స్థాయికి పెరిగిన సందర్భంలో భద్రతా చర్యల దృష్ట్యా రాకపోకలను పూర్తిగా నిషేధించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని గంటి పెదపూడి శివారు బూరుగులంక రేవును సోమవారం ఆయన స్థానిక అధికారులతో కలసి పరిశీలించారు. లంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణించేటప్పుడు లైఫ్ జాకెట్లు, ఇతర జాగ్రత్త చర్యలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వరదల నేపథ్యంలో అధికారుల సూచనలతో కాజ్‌వేల వద్ద రాకపోకలు సాగించాలన్నారు. కార్యక్రమంలో కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, డీఆర్‌డీఏ పీడీ సాయినాథ్ జై చంద్ర గాంధీ, తహసీల్దార్ పి.శ్రీవల్లవి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెన్నపు వర్మ, వీఆర్వో కె.భగవన్నారాయణ, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదవశాత్తూ ఓ వ్యక్తి కాలు విరిగిపోవడంతో వైద్యం అనంతరం విశ్రాంతిలో ఉండటంతో కుటుంబం గడవడానికి ఇబ్బంది పడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు సోమవారం రూ.11,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. సంస్థ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రావులపాలెం గ్రామానికి చెందిన ఉల్లూరి నాగరాజు చాలా ఏళ్ల క్రితం కాలికి ఆపరేషన్ జరిగింది. కోలుకుని పని చేసుకుంటుండగా 4 నెలల క్రితం ఆపరేషన్ జరిగిన చోటే మళ్లీ కాలు విరిగింది. కొన్ని నెలలు విశ్రాంతిగా ఉండాలని వైద్యులు చెప్పారు. దీంతో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. సభ్యులు రావులపాలెంలోని నాగరాజు ఇంటికి వెళ్లి రూ.11,500 చెక్కు అందజేశారు.